# చిట్టి

ఆఫీస్ ఇన్స్‌పెక్షన్ పూర్తి చేసి, గెస్ట్‌హౌస్‌కి తిరిగొచ్చిన పవిత్ర బాగా అలిసిపోవడంతో, వేడివేడి నీళ్ళు స్నానం చేసి, కాస్త అలుపు తీర్చుకుందామని, బాత్‌రూంలో కెళ్లి గీజర్ ఆన్ చేసింది.

"అమ్మా! రేపటి నుంచి నేను లీవుపెట్టుండా! నా బిడ్డ పెండ్లి!" అన్నాడు శివయ్య.

"పెళ్లెప్పుడు శివయ్యా" అడిగింది పవిత్ర.

"వచ్చే మాఘ మసంలో!"....

"మఘమాసంలోనా? అయితే ఇప్పుడు లీవెందుకు?" అడిగింది పవిత్ర ఆశ్చర్యంగా.

'రేపు పెదానం. మా ఇళ్లల్లో పెదానం కూడా ఒక చిన్నపెల్లి లాగే సేత్తారు.'

"ఊరికే డబ్బులు ఎక్కువగా ఖర్చుపెట్టెయ్యకు శివయ్యా. ఏవేవో శాస్త్రాలూ, సంప్రదాయం అంటూ అయినదానికీ, కానిదానికీ బోలెడు ఖర్చు పెట్టేస్తూ వుంటారు. అయిన వాళ్లనీ, కాని వాళ్లనీ అందర్నీ పిలిచి భోజనాలూ, బట్టలూ పెట్టి, ఏవేవో చేసేస్తుంటారు మర్యాదలని!"...

"అవన్నీ.. తప్పవు కదమ్మగోరూ... ఏబాస మాట్టాడినా, ఏజాతివోల్లైనా ఇయ్యన్నీ అందరికీ వున్నయ్. కొన్ని కొన్ని మానుకోవాలని సెప్పినా, సాలామంది, ఎవరూ మానుకోరమ్మా. తనదాకా ఒచ్చేటప్పటికి అన్నీ జరగాల్సిందే" బల్లగుద్ది చెప్పినట్టుగా స్పష్టంగా చెప్పాడు శివయ్య..

శివయ్య మాటలు నిజమేననిపించింది పవిత్రకి. ఎదుటివాళ్ళకి ఏవేవో సలహాలు చాలామంది ఇస్తూనే వుంటారు. కానీ, తమదాకా వచ్చేటప్పటికి ఆ ఆదర్శాలన్నీ మటుమాయమైపోయి, మళ్ళీ అన్నీ మామూలుగానే సరిపేస్తారు. 'ఈ సంప్రదాయాల ఊబిలో నుంచి, ఆచారాల పరిధిలో నుంచి మనం బయటపడడం చాలా కష్టం..." ఆలోచిస్తూ కుర్చీలో నుంచి లేచివెళ్ళి గీజర్ ఆఫ్ చేసొచ్చింది పవిత్ర.

"ఏన్నీళ్లు తియ్యమంటారా అమ్మగోరూ?" అడిగాడు."

"ఒద్దులే...కాస్సేపాగి చేస్తానులే!... ఆఁ.. నీకూతురు పేరేంటి? అడిగింది.

"సాయిత్రీ...బానుమతి" అన్నాడు నవ్వుతూ..

"అదేంటి? రెండు పేర్లు!" అంది ఆశ్చర్యంగా పవిత్ర.

"అదీ.. మా సిట్టి పుట్టినప్పుడు నేనూ మా ఆవిడ పోట్లాడుకున్నాం. మా ఆవిడకి సాయిత్రి గారంటే సానా ఇట్టం. ఆ యమ్మగోరున్న ఏ సినిమా సూడకుండా ఒదిలిపెట్టేదికాదు. అట్టాగే నాకు బానుమతమ్మ శానా ఇట్టం. ఆయమ్మగోరి యాక్సనన్నా పాటలన్నా నాకు పాణం. నేను బానుమతమ్మగోరి పేరుపెడతానని మా ఆవిడ సాయిత్రిగోరి పేరుపెడతానని పట్టుపట్టినం. అప్పుడు మావోల్లు రెడూ కలిపి పెట్టేయ్యమన్నారు. ఆ సలహా బానే వుందని అట్టాగే సేశాం."

పవిత్ర పెద్దగా నవ్వింది.

"ఎందుకమ్మా నవ్వుతున్నారు?" అర్థం కాక అడిగేడు శివయ్య.

అదికాదు శివయ్యా.." పూర్వం మా అమ్మపేరు పెడతానంటే, మా అమ్మ పేరు పెట్టండి" అని పోట్టాడుకునేవారు... ఇప్పుడు..

"ఓ.. అదా!" వాడూ నవ్వేశాడు.

"ఇంతకీ అమ్మాయిని ఏ పేరుతో పిలుస్తారు?" అడిగింది పవిత్ర.

"సిట్టీ" అని పిలుత్తాం.

ఈసారి మరీ గట్టిగా నవ్వేసింది పవిత్రం.

"మళ్లా ఎందుకు నవ్వుతున్నారమ్మా?" ... మరింత ఆశ్చర్యంగా అడిగాడు శివయ్య.

ఆలోచించి ,ఆలోచించి మంచి పేర్లు పెట్టుకోవడం.. ఆ పేర్లతో పిలవకుండా, 'బుజ్జీ, పప్పీ, చిట్టీ' అంటూ ముద్దుపేర్లతో పిలవడం. జనానికి ఈ ముద్దుపేర్లే అలవాటయిపోయి, అసలు పేరుతో పిలవరు. ముచ్చటపడి ఆ పేర్లు పెట్టి ఏం లాభం? అంది నవ్వుతూనే పవిత్ర.

"నిజమే అమ్మగోరూ" అన్నాడు శివయ్యా..

"అది సరే.. చిట్టిని కాస్తయినా చదివించావా?"

"మొన్ననే బల్లో ఏశామండి. అప్పుడే అ ఆ ఇ ఈలన్నీ రాసేత్తా వుందండి... సిసీంద్రీలాటి పిల్ల" గొప్పగా చెప్తున్న శివయ్య కేసి సీరియస్ చూసింది పవిత్ర.

శివయ్య సంతోషంతో తనకేసే చేస్తున్నాడు.

"శివయ్యా.. చిట్టి వయస్సెంత?" అడిగింది.

"ఏడెల్లి ఎనిమిదొచ్చాయండి. ఎందుకంటే అది పుట్టిన వారం రోజులకే నాకీ వాచ్‌మన్ ఉద్యోగం ఒచ్చిందండీ".. అన్నాడు.

వాడు చెప్పే ఇంకేమాటా పవిత్ర చెవికి పోవడంలేదు. "ఏడెల్లి ఏనిమిదొచ్చాయండి" .. ఆమాటలే చెవి నింపేశాయి...

పవిత్ర మొహం ఎర్రబారిపోయింది... ఆవేశం, ఆవేదనా అలుముకుని మొహం జేవురించింది... పిచ్చిదానిలా అరిచింది.

"శివయ్యా.. ఈ పెళ్లి ఆపు చెయ్యి" అంటూ...

శివయ్య మతి పోయినా వాడిలా ఆమెకేసి చూశాడు.

ఆమె ఆవేశంతో అపరకాళికలా అగుపించింది శివయ్యకి'. నోటమాట రాక ఆమెకేసి చూస్తూండిపోయాడు. పవిత్ర కాస్త ఆవేశాన్ని తగ్గించుకుని చెప్పడం మొదలెట్టింది.

"కూర్చో శివయ్యా... నీకో కథ చెబుతా... విన్నాక నీ ఇష్టం వచ్చినట్టు చెయ్యి.." అంది. శివయ్య ఎదురుగా వున్న సోఫా పక్కన నేలమీద కూచున్నాడు చేతులు కట్టుకుని.

"శివయ్యా! నాకు అప్పుడు ఎనిమిదేళ్ళు. మా నాయనమ్మ చాలా ముసలమ్మ అయిపోయిందని, ఆమె నా పెళ్లి చూసి కళ్లు మూస్తానందని మా నాన్నగారు నాకు మా బంధువుల్లోనే ఒకబ్బాయిని చూసి, పెళ్లి చేసేశారు. అప్పుడు నేను రెండోక్లాసు, అతడు నాలుగో క్లాసు. పెళ్లంటే అందరూ రావడం, మంచి మంచి బహుమతులివ్వడం, కొత్త బట్టలు కట్టుకోవడం, పిండివంటలు తినడం, బాజాలూ భజంత్రీలూ ఇవే తప్ప ఇంకేమీ తెలీదు. సరదాగా పుట్టినరోజు పండగనాడు ఆడుకున్నట్టుగా పెళ్లిలో ఆడుకుంటూ కూర్చున్నాం మేము.

పవిత్ర గొంతు బొంగురుపోయింది. క్షణంసేపు చెప్పడం ఆపింది. అంతలో ఎవరో ఒచ్చారు. "కలెక్టరమ్మ గారున్నారా?" అంటూ.

పవిత్ర పి.ఏ. ని పిలిచి "ఎవరొచ్చినా ఒంట్లో బాగులేదని" పంపించేయండి. రేపు పొద్దుటే రమ్మనండి!" అంది.

"సరే మేడమ్" అంటూ అతడు వెళ్లిపోయాడు.

పవిత్ర మళ్లీ చెప్పడం మొదలెట్టింది. "ఒక రెండేళ్లు బాగానే గడిచిపోయాయి. సెలవుల్లో నన్ను వాళ్ల వూరు విశాఖపట్నం తీసికెళ్లేవారు. ఊరంతా తిరిగేవాళ్లం. బోలెడు బొమ్మలూ బట్టలూ ఏవేవో కొనుక్కునేదాన్ని. భార్య భర్తలు, సిగ్గూ ఏమీ తెలీని వయస్సది.

ఆ తరవాత ఒకరోజున టెలిగ్రాం వొచ్చింది. అతడు టైఫాయిడ్ వచ్చి చచ్చిపోయాడని. అంతే! నా బొట్టుతుడిచేశారు. గాజులు తీసేశారు. బడి మాన్పించేశారు. అందరూ ఏడుపే.'

శివయ్య బిత్తరపోయి చూస్తున్నాడు.

"నన్ను... ఇల్లు కదలనిచ్చేవారు కాదు.. ఆడుకోనిచ్చేవారు కాదు.. పసివయస్సులో వున్న ముసలమ్మలా ఇంట్లో అమ్మకి సహాయం చేస్తూ వుండేదాన్ని. నన్ను చూసి అమ్మ ఎప్పుడూ ఏడ్చేది. అప్పుపడు నేనూ ఏడ్చేదాన్ని. నా పెళ్లికి కుట్టించిన పట్టు పరికిణీలు మా చెల్లెలె వాడేస్తూంటే, నేను దెబ్బలాడేదాన్ని! అయినా నన్ను వేసుకోనిచ్చేవారు కాదు. ఒకరోజున.. ఏంజరిగిందో తెలుసా?

దుఃఖం ముంచుకొస్తూ వుంటే, పవిత్ర క్షణం ఆగి, గొంతు సవరించుకుని, మళ్లీ చెప్పడం మొదలెట్టింది.

వరలక్ష్మీ వ్రతానికని అమ్మ చీరకొనుక్కుంది. చెల్లెలికి మంచి పట్టుపరికిణీ కుట్టించారు. నాకు చిన్న అంచు చిన్నచిన్న పువ్వులున్న తెల్ల పరికిణీ తెల్లవోణీ కుట్టించారు. ఆ బట్టలు నాకు నచ్చలేదు. అందరూ పడుకున్నప్పుడు, రాత్రి బాగా పొద్దుపోయాక, చెల్లెలి పట్టుపరికిణీ తీసి వేసుకున్నాను. చెల్లెలి గాజుల్నీ. రిబ్బన్లనీ తీసి వేసుకుని, ఎర్రటి తిలకం పెట్టుకుని బాగా ముస్తాబై అద్దం ముందు కూర్చున్నాను. అతా ఎంతసేపు కూర్చున్నానో నాకే తెలీదు.

నాన్నగారి అరచేయి నా చెంపమీద పడి ఛెళ్లుమనేవరకూ నాకే తెలీదు. నన్ను కొట్టినందుకు నాన్నగారు కంటతడిపెట్టారు. దెబ్బలు తిన్నందుకు నేను ఏడ్చాను. మమ్మల్ని చూసి అమ్మ ఏడుపు! మర్నాడు అమ్మ పూజచేసుకోలేదు సరికదా, అందరూ ఏడుపే! నాకు చచ్చిపోవాలనిపించింది. చావుకీ బతుకుకీ అర్థం తెలిసే వయసుకాదది. కానీ, నావల్ల అందరూ ఏడుస్తున్నారనీ బాధపడ్తున్నారనీ మాత్రం తెలుసు. పెరట్లో బావిలోకి దూకబోయాను.

"అమ్మగోరూ!' అరిచాడు శివయ్య! అతడు ఏడుస్తూన్నట్టు అతడి కంఠం చెప్పింది. పవిత్ర కాస్సేపాగి చెప్పడం మొదలెట్టింది. అప్పుడు ఇరుగు పొరుగులందరూ గుమిగూడి పోయారు. నలుగురూ నానా మాటలూ అన్నారు అమ్మనీ, నాన్ననీ! "చిన్నపిల్లకి పెళ్లి చెయ్యడం తప్పన్నారు. 'శారదా ఆక్ట్ ప్రకారం ఆడపిల్లకి పద్దెనిమిదేళ్ళు రానిదే పెళ్లి చెయ్యడం నేరమని తెలీదా?" అని నాన్నని నిలదీశాడొకాయన.

'బాల్య వివాహాలు చెయ్యకూడదనీ, ఒకవేళ విధిరాతవల్ల చేసిన పెళ్లిళ్లు ఇలా అయితే, పునర్వివాహాలు చేయ్యమని వీరేశలింగం పంతులుగారూ, రాజా రామ్మోహన రాయ్ గారూ, గాంధీ గారూ అందరూ చెప్పగా మీరు వినలేదా?' అని కొందరు అడిగారు. అన్నింటికీ

సమాధానంగా నాన్నగారు దోషిలా తలవంచుకు నుంచోవడం నాకు చాలా బాధ కలిగించింది. ఇంకెప్పుడూ ఇలా చెయ్యకూడదని నిర్ణయించుకున్నాను.

ఆ తరవాత కొన్నాళ్లకి మానాన్నగారి స్నేహితుడొకాయన మా ఊరొచ్చారు. అతను నాన్నగారిని ఒప్పించి. నన్ను మద్రాసులోని ఆంధ్ర మహాసభస్కూల్లో చేర్పించి, మా ఇంటి వాతావరణానికి దూరంగా నన్ను తీసుకెళ్లి, వాళ్లింట్లో వుంచుకుని చదివించారు వాళ్లబ్బాయితో పాటు.

అతడే భాస్కర్. ఇద్దరం ఐ.ఎ.ఎస్. చేశాం. ఆ మహానుభావుడే మా ఇద్దరికీ పెళ్లిచేసి నన్ను వారుఇల్ల కోడలిగా చేసుకున్నారు. అలా ఎంతమందికి జరుగుతుంది శివయ్యా! అతని వల్లే నేనీనాడు మీ ముందు కలెక్టరుగా వున్నాను. లేకపోతే?... అమ్మా వాళ్లింట్లో వంటింట్లో పని చేసుకుంటూ వుండేదాన్ని!" పవిత్ర చెప్పడం ఆపింది. నీళ్లు నిండిన కళ్లను కర్చీఫుతో తుడుచుకుంది.

శివయ్య గుండె ద్రవించిపోయిందేమో, వాడూ కళ్లు తుడుచుకున్నాడు.

"శివయ్యా!.. నేను చెప్పిన విషయం ఇరవై ఏళ్లనాటిది. కానీ.. ఈ కాలంలోనూ నువ్వెందుకిలా చేస్తున్నావు?" అడిగింది పవిత్ర.

"అమ్మగోరూ.. నేనూ మాయమ్మ ముసిల్దయిపోతున్నాదనీ ఆమె దీని పెళ్ళి సూసి సంతోషిస్తాదనీ సేత్తున్నా.." కానీ, మీ కదంతా ఇన్నాక... ఇప్పుడు... సెయ్యబుద్ధి కావడం లేదమ్మగోరూ..."

"గుడ్... శివయ్యా.. చిట్టినీ, నీ కాబోయే అల్లుణ్ణీ కూడా బడికి పంపించి బాగా చదివించు. మీకు ఖర్చులేకుండా వాళ్లకి ప్రభుత్వం పుస్తకాలు కొనిసాత్తుంది. స్కాలర్‌షిప్పు ఇస్తుంది. ఇంకా ఏమైనా కావాలంటే నన్ను నిర్భయంగా అడుగు. నన్ను కలుసుకోవడానికి నువ్వు హైదరాబాదు రావచ్చు" సంతోషంగా చెప్పింది పవిత్ర.

"అట్టాగే.. అమ్మగోరూ!" వాడు కంటతడి పెట్టేడు.

"ఈ పెళ్లి ఇప్పుడు చెయ్యవద్దన్నానని నువ్వు బాధపడడం లేదు కదా?" అడిగింది పవిత్ర.

"లేదమ్మగోరూ! నా కల్లు తెరిపించారు మీరు" అన్నాడు ఏడుస్తూనే శివయ్య..

"అమ్మగోరూ! గలగలా మాట్టాడే మీ గుండెలో ఇంత దుఃఖం దాక్కుందా? సీతమ్మోరిలా ఎన్ని కట్టాలు పడ్డారమ్మా.. ఇంటుంటే, నా కడుపు తరుక్కుపోనాది."

పవిత్ర గలగలా నవ్వింది.

శివయ్య ఏడుపుమాని ఆమెకేసి చూశాడు.

"శివయ్యా.. నాకథ వింటేనే.. నువ్వింత బాధ పడుతున్నావే.. రేపు చిట్టికి అన్యాయం జరిగితే భరించగలవా?"

"అమ్మో! నావల్లకాదు. నా గుండె బద్దలైపోతాది."

"అందుకే! అందుకే! ఆడపిల్లా! మొగపిల్లాడు అనే తేడాలు మానేసి, పిచ్చి పిచ్చి సెంటిమెంట్లకి అంటే ప్రేమా సంప్రదాయం అంటూ తొందరపాటుతో ఏ పనీచెయ్యక చిట్టిని బాగా చదివించు. ఉద్యోగం చేసుకోనివ్వు.. ఆ తరువాత ఆమెకు కూడా నచ్చిన వాడితో ఆమె ఇష్టా అయిష్టాలు తెలుసుకుని పెళ్లి చెయ్యి. అంతవరకు ఈ నిశ్చితార్థాలు కూడా చెయ్యవద్దు. ఇప్పటినుంచే ఆ చిన్నారి మనసుల్లో భార్యా భర్తలు, సంసారం అనే పదాలు ఎక్కనీకు!.. సరేనా? చిట్టి విషయంలో నీకు ఎప్పుడు ఏ సలహా కావాలన్నా నన్నడుగు. నా దగ్గరకురా." అంది.

"అమ్మగోరూ! మా జీవితాలను దిద్దడానికి మీరు క్యాంపుమీద మా ఊరొచ్చారమ్మా. మీరే రాకపోతే, నాకీ యవ్వారం అంతా తెలీక మా సిట్టి పెదానం, పెళ్లీ కూడా సేసేసుండేవోన్ని... నీకు కోటి దండాలమ్మా." అంటూ పాదాలమీద పడ్డ శివయ్యని లేవదీసి, ఊరుకో శివయ్యా!.. దేవుడు ప్రతీవాళ్లకీ ఎవరి వల్లో ఒకరివల్ల దారి చూపుతాడు. నాకు దారి చూపించింది నాన్నగారి స్నేహితుడు. ఈరోజు చిట్టిని దిద్దడానికి నేను కారకురాలినయ్యాను. ఈ క్యాంపు వల్ల ఇంత మంచి పని జరుగుతుందని, నేనూ అనుకోలేదు శివయ్యా...! నాకెంతో తృప్తిగా వుంది." అంది వందరూపాయల నోటు తీసి శివయ్య చేతిలో పెడతూ.

"ఎందుకమ్మా ఇది. ఈ డబ్బు నాకొద్దు. మీరు చేసిన ఈ మేలు జనమ జనమలకీ మర్సిపోలేను."

" ఈడబ్బు నీకోసం కాదయ్యా.. బళోలకి కావలసిన పుస్తకాలూ అవీ చిట్టికి కొను. ఆ తరవాత నేను స్కాలర్‌షిప్ వచ్చే ఏర్పాట్లు చేస్తానులే.. తీసుకో" అంటూ ఇచ్చింది. అట్లాగే బెల్‌కొట్టి పీ.ఏ.ని పిలిచింది డిక్టేషన్ రాసుకోమని!

"ఒత్తానమ్మా" అంటూ వెళ్లిపోయాడు శివయ్య... పవిత్ర తేలికపడ్డ మనసుతో హాయిగా ఊపిరిపీల్చుకుంది, చిట్టి భవిష్యత్తుని ఊహించుకుంటూ!

* * *